క్లుప్తంగా

యాచారంలో కుండపోత

జలమయమైన సాగర్ రహదారి



యాచారం: యాచారం సోమవారం మధ్యాహ్నం కుండపోత వర్షం కురిసింది. అరగంట పాటు ఎడతెరిపి లేకుండా దంచికొట్టడంతో సాగర్‌రోడ్డుపై వరద నీరు నిలిచింది. అలాగే పీఏసీఎస్ కార్యాలయం వద్ద రోడ్డుపై నీళ్లు నిలవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నెల రోజులుగా వర్షాల్లేక మెట్ట పంటలు పూర్తిగా వాడిపోయాయి. ఈ వర్షం ఎండిపోతున్న పంటలకు జీవం పోసింది. వర్షంతో రైతులు ఊరట చెందారు. పంట పొలాల్లో నీరు చేరడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మొండిగౌరెల్లి, యాచారం, మల్కీజ్‌గూడ, చౌదర్‌పల్లి, గునుగల్, గడ్డమల్లయ్యగూడ తదితర గ్రామాల్లో వర్షం కురిసింది.

భక్తితోనే ముక్తి



కోట మైసమ్మ ఆలయాన్ని ప్రారంభించిన నాయకులు

కడ్తాల్: గ్రామాల్లో ఆలయాల నిర్మాణంతో ఆధ్యాత్మికత, భక్తి భావం పెంపొందుతుందని జెడ్పీటీసీ దశరథ్ అన్నారు. మండలంలోని సాలార్‌పూర్ గ్రామంలో గూడెపు సిలారి-హంసమ్మల ఆధ్వర్యంలో నిర్మించిన కోట మైసమ్మ ఆలయాన్ని సోమవారం స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తితోనే ముక్తి లభిస్తుందన్నారు. ఆలయాల నిర్మాణంతో గ్రామాల్లో భక్తిభావం మరింత పెంపొందుతుందని తెలిపారు. అనంతరం ఆలయ నిర్మాణ దాతలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎంపీటీసీల సంఘం గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్, నాయకులు ఖాధర్ తదితరులు పాల్గొన్నారు.

రాజీమార్గం రాజమార్గం



బాల్‌రాం, ఎస్‌ఐ

ఆమనగల్లు: కేసుల రాజీ కోసం నిర్వహిస్తున్న లోక్ అదాలత్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమనగల్లు ఎస్‌ఐ బాల్‌రాం కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఆమనగల్లు కోర్టులో ఈ నెల 9వ తేదీ వరకు జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేసులో రాజీ పడటం అంటే ఇరువర్గాలు గెలిచినట్లేనన్నారు. రాజీమార్గం రాజమార్గమని ఆయన చెప్పారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటం

హస్తినాపురం: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి రాజీ లేని పోరాటం చేస్తామని ఎల్‌బీనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. సోమవారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని వాంబేకాలనీ సందర్శించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను రాంరెడ్డి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎల్‌బీనగర్ ఎస్టీ సెల్ చైర్మన్ రమేశ్‌నాయక్, కాలనీ అధ్యక్షుడు గోపాల్‌నాయక్, గుడి చైర్మన్ శ్రీకాంత్‌నాయక్, కాంగ్రెస్ నాయకులు శ్రీపాల్‌రెడ్డి, హుస్సేన్, మోహన్‌రాథోడ్, రాజు,కుశ, శంకర్,శ్రీశైలం, రవి,కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

వరదనీటి సమస్యను పరిష్కరిస్తాం



కాలనీలో వరదనీటిని పరిశీలిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: డివిజన్ పరిధిలో పలు కాలనీలో వర్షాలు కురిసినప్పుడు నీరు వెళ్లేందుకు వరద కాలువను నిర్మించనున్నామని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దులచ్చిరెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని శ్రీకృష్ణదేవరాయకాలనీలో వర్షంనీరు రోడ్లపైనే ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కాలనీ వాసులు ఇచ్చిన సమాచారంతో సోమవారం ఆయన కాలనీలో పర్యటించారు. వరదనీటి సమస్య పరిష్కారానికి అన్ని చర్యలు తీసుకుంటామని కాలనీ వాసులకు హామి ఇచ్చారు.

ఉత్తమ గురువులు



పాండు



లీలావతి



ఇందిర



విజయ

తలకొండపల్లి: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని బోధనలో ఉత్తమ ప్రతిభ చూపిన ఉపాధ్యాయులను జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నుకున్నారు. శారదాదేవి ఎస్‌ఏ (జెడ్పీహెచ్‌ఎస్ ఖానాపూర్), ఐ.ఎస్ జెర్మీయ ఎస్‌ఏ (జెడ్పీహెచ్‌ఎస్ తలకొండపల్లి), డి. ప్రసన్నలక్ష్మి (పీఎస్ చుక్కాపూర్), కె. శ్రీనివాసులు (పీఎస్ మెదక్‌పల్లి), మల్లేశ్, జెడ్పీహెచ్‌ఎస్ ఖానాపూర్ జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైనారు. వీరిని పీఆర్‌టీయూ మండలాధ్యక్షుడు, హెచ్‌ఎం భగ్‌వాన్‌రెడ్డి, ప్రదాన కార్యదర్శి అరవింద్ కుమార్ అభినందించారు. ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

కడ్తాల్ నుంచి ఐదుగురు

కడ్తాల్: కడ్తాల్ మండలం నుంచి ఐదుగురు ఉపాధ్యాయులు జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. కడ్తాల్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన ప్రధానోపాధ్యాయురాలు విజయ, బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన ఫిజికల్ డైరెక్టర్ చంద్రమోహన్, కడ్తాల్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు సుశీల, పెద్ద వేములోనిబావితండా ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు ఇందిర, కులకుంటతండాకు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు శ్రవణ్‌కుమార్ జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు.

ఆమనగల్లులో..

ఆమనగల్లు: ఆమనగల్లు బాలుర ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు టి.లీలావతి, ఆమనగల్లు ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఎం. పాండు జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపధ్యాయులుగా ఎంపికయ్యారు.

అబ్దుల్లాపూర్‌మెట్: అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కుత్బుల్లాపూర్ జిల్లా ఉన్నతపాఠశాలలో ఆంగ్ల భాషోపాధ్యాయుడిగా పనిచేస్తున్న కలకొండ కృష్ణయ్యను జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎన్నుకున్నారు.

ఇబ్రహీంపట్నం మండలం నుంచి ఏడుగురు

ఇబ్రహీంపట్నం: జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఇబ్రహీంపట్నం మండలం నుంచి ఏడుగురు ఎంపికయ్యారు. మహేందర్‌రెడ్డి (ముకునూర్, యూపీఎస్), టీ హేమలత (జెడ్పీహెచ్‌ఎస్, చర్లపటేల్ గూడ), స్వర్ణలత (జెడ్పీహెచ్‌ఎస్, ఇబ్రహీంపట్నం), శ్రీవాణి (జెడ్పీహెచ్‌ఎస్, కొంగరకలాన్), ఎస్. వెంకటేశ్ (జెడ్పీహెచ్‌ఎస్, పటేల్‌గూడ), జే.వెంకటేశ్ (పీఎస్, సాహెబ్‌గూడ), పీ అరుణ (పీఏ, చర్లపటేల్ గూడ) ఎంపికయ్యారు. ఇబ్రహీంపట్నం జిల్లా పరిషత్ కార్యాలయంలో జరిగే కార్యక్రమంలో జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేల చేతుల మీదుగా ఆవార్డులు అందుకోనున్నారు. ఉపాధ్యాయులుగా ఎంపిక కావడంపై హర్షం వ్యక్తంచేశారు.

మరింత బాధ్యత పెంచింది



జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఏంపిక కావడం చాల గర్వంగా ఉంది. అదే విధంగా మరింత బాధ్యతను పెంచింది. మండల, జిల్లా స్థాయి అధికారుల సహాకారంతో పని చేసే చోట పాఠశాల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తాం. ప్రజా ప్రతినిధులు, విద్యార్థుల తల్లి దండ్రుల ప్రోత్సహంతో విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకునే విధంగా పని చేస్తాం.

– కంభాల పల్లి శ్రీకాంత్, ప్రధానోపాధ్యాయుడు, బండలేమూర్

మంచి ప్రోత్సాహం



జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలుగా అవార్డుకు ఏంపిక కావడం చాల సంతోషంగా ఉంది. కష్టపడి పాఠశాల అభివృద్ధికి పాటు పడడంతో మంచి ప్రోత్సాహం అందించిన్నట్లు ఉంది. మరింత కష్టపడి అధికారులు, ప్రజా ప్రతినిధుల సహాకారంతో విద్యార్థులకు మరింత నాణ్యమైన విద్యను అందిస్తాం.

– సుగంధ, ప్రధానోపాధ్యాయురాలు, మంచాల

మరింత బాధ్యత పెంచింది

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా గుర్తించడం ఎంతో సంతోషంగా ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యబోధన అందించేందుకు కృషి చేస్తా. విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు వెళ్లేందుకు మంచి విద్యను అందిస్తా.

చాట్ల యాదగిరి, ప్రాథమికోన్నత పాఠశాల, తక్కళ్లపల్లి

మేటి క్రీడాకారులను తయారు చేస్తా

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులను మేటి క్రీడాకారులుగా తయారు చేస్తా. ఉత్తమ పీడీ టీచర్‌గా ఎంపిక చేయడం సంతోషంగా ఉంది. భవిష్యత్తులో యాచారం ఉన్నత పాఠశాల నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో పలు క్రీడా రంగాల్లో రాణించే విధంగా కృషి చేస్తా.

దేవదాసు, పీడీ టీచర్, యాచారం ఉన్నతపాఠశాల

మాతృ భాషపై పట్టుకోల్పోకుండా..

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు మాతృభాషపై పట్టుకోల్పోకుండా కృషి చేస్తా. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా గుర్తింపు రావడం సంతోషంగా ఉంది. తెలుగు భాషను ఎవరూ విస్మరించరాదు. విద్యార్థుల అభ్యున్నతికి పాటుపడతాం.

జి. కిష్టయ్య, ఎల్‌పీటీ, నక్కర్తమేడిపల్లి ఉన్నత పాఠశాల

పెద్ద చెరువును పరిశీలించిన ఎమ్మెల్యే



పెద్ద చెరువు పరిసరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం పెద్ద చెరువును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలను అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఈ మేరకు నీటి పారుదలశాఖ ఎస్‌ఈ హైదర్‌ఖాన్, ఈఈ బన్సీలాల్, డిప్యూటీ ఈఈ ఉషారాణి, హెచ్‌ఎండీఏ ఈఈ పద్మలతో కలిసి పెద్ద చెరువు పరిసర ప్రాంతాలను సోమవారం ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి పరిశీలించారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతో పెద్ద చెరువును పర్యాటక కేంద్రంగా మార్చేందుకు రూ. 18.90 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే తెలిపారు. అన్ని హంగులతో పర్యాటక కేంద్రంగా ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు త్వరలో మారనున్నట్లు తెలిపారు.

డ్రైవింగ్ లైసెన్స్ క్యాంపు ప్రారంభం



ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ క్యాంపును ప్రారంభిస్తున్న రాఘవేందర్‌రెడ్డి తదితరులు

తలకొండపల్లి: 18 ఏళ్లు నిండిన యువతీ యువకులందరూ ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు రాఘవేందర్‌రెడ్డి కోరారు. సోమవారం మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ క్యాంపును ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆధార్ కార్డు, ఎస్‌ఎస్‌సీ మెమోతో పాటు తదితర ధ్రువపత్రాల జిరాక్స్‌లతో డ్రైవింగ్ లైసెన్స్‌కు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల యువతకు డ్రైవింగ్ లైసెన్స్‌పై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతోనే ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ క్యాంపును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రవికాంత్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు మహేశ్, సీనియర్ నాయకులు డేవిడ్, నరేందర్‌గౌడ్, శ్రీశైలం, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై పోరాటం



ఎన్నికైన ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ కమిటీ సభ్యులు

ఆమనగల్లు: విద్యారంగ సమస్యలపై ఎస్‌ఎఫ్‌ఐ నిరంతరం పోరాడుతుందని సంఘం జిల్లా కార్యదర్శి శంకర్, జిల్లా ఉపాధ్యక్షుడు చరణ్‌లు అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని ప్రమీలమ్మ జూనియర్ కళాశాలలో సోమవారం ఆమనగల్లు ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ మొదటి మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదువుతూ పోరాడు... చదువుకై పోరాడు.. అనే నినాదంతో ఎస్‌ఎఫ్‌ఐ ముందుకు వెళుతుందన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ అధ్యక్షుడు అరుణ్, నాయకులు శివశంకర్, శ్రీకాంత్, శివ పాల్గొన్నారు.

నూతన కమిటీ

ఆమనగల్లు ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ అధ్యక్షుడిగా అరుణ్, కార్యదర్శిగా శివ, ఉపాధ్యక్షులుగా ఆదర్శ్‌యాదవ్, వినోద్‌కుమార్, శివాజీ, శ్రీకాంత్, రవీందర్, హారిక, శ్రావణి, మనీష, తేజ, సహాయ కార్యదర్శులుగా మహేశ్, మల్లేశ్, పవన్‌యాదవ్‌లను ఎన్నుకున్నారు.

ఘనంగా బొడ్రాయి, పోతలింగన్న విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహాల ప్రతిష్ఠలో పాల్గొన్న ఎమ్మెల్యే

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేటలో నూతనంగా నిర్మిస్తున్న బొడ్రాయి (నాభిశిల), పోత లింగన్న స్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాల్లో భాగంగా సోమవారం బొడ్రాయి, పోతలింగన్న విగ్రహాలను ఘనంగా ప్రతిష్ఠించారు. సోమవారం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో పాటు ఆర్థికంగా ఎదగాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మురళీధర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, విద్యావిజయేందర్‌రెడ్డి, జయశ్రీ రాజు, దండెం కృష్ణారెడ్డి, కోఆప్షన్ సభ్యురాలు సబితతో పాటు గ్రామస్తులు, వివిధ కాలనీల ప్రజలు పాల్గొన్నారు.

గోలి శ్రీనివాస్‌రెడ్డికి సత్కారం



గోలి శ్రీనివాస్‌రెడ్డిని సత్కరిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఆమనగల్లు: రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్‌గా నియమితులైన గోలి శ్రీనివాస్‌రెడ్డిని పలువురు బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు సత్కరించారు. సోమవారం హైదరాబాద్‌లో ఆయనను మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు అర్జున్‌రావ్, వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకుడు శంకర్, పరమేశ్, ప్రశాంత్ నాయక్, కృష్ణ, రాములు, తిరుపతి, బాబు, విజేందర్ తదితరులు శాలువాలతో సత్కరించారు. అలాగే శ్రీనివాస్‌రెడ్డిని ఆమనగల్లు మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు నిరంజన్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి రమేశ్, నాయకులు అల్లాజీ, సుభాశ్, శివకుమార్, సతీష్, కిరణ్, శివ సత్కరించారు.

ఘన సన్మానం

తలకొండపల్లి: రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోళి శ్రీనివాసురెడ్డిని ఘనంగా సన్మానించారు. గట్టుఇప్పలపల్లి సర్పంచ్ జయమ్మ, వెంకటయ్య, వీరన్నపల్లి సర్పంచ్ నాగమణి, లింగంగౌడ్ సోమవారం హైదరాబాద్‌లో శ్రీనివాసురెడ్డిని మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. అనంతరం ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, విష్ణువర్ధన్, శంకర్, లింగంగౌడ్, వెంకటయ్య, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

కడ్తాల్: ఆపదలో ఉన్న పేదలను ఆదుకునేందుకు రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ఎల్లప్పుడు ముందుంటుందని ట్రస్ట్ చైర్మన్, జెడ్పీటీసీ దశరథ్ అన్నారు. కడ్తాల్ మండలం బాలాజీనగర్ తండా గ్రామ పంచాయతీలోని రేకులకుంటతండాకు చెందిన లక్ష్మి అనే మహిళ అనారోగ్యంతో ఆదివారం మృతి చెందింది. బాధిత కుటుంబాన్ని దశరథ్ సోమవారం పరామర్శించారు. అనంతరం బాధిత కుటుంబానికి రూ.5 వేలు సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కమ్లీ, బీచ్యానాయక్ ఉన్నారు.

కడ్తాల్‌లో..

కడ్తాల్: మండల పరిధిలోని రావిచేడ్ గ్రామానికి చెందిన లక్ష్మమ్మ అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం రాత్రి మృతి చెందింది. విషయం తెలుసుకున్న స్థానిక ఎంపీటీసీ గోపాల్, బాధిత కుటుంబాన్ని సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి రూ.3 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. పరామర్శించిన వారిలో బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు రమేశ్‌యాదవ్,నాయకులు శ్రీశైలంయాదవ్, సంతోష్, యాదగిరి, రమేశ్, మహేశ్, శ్రీను, శ్రీకాంత్ ఉన్నారు.

వైద్య చికిత్సకోసం..

ఆమనగల్లు: మాడ్గుల మండలం నర్సంపల్లి గ్రామానికి చెందిన మహేశ్ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న మహేశ్ తండ్రి యాదయ్యకు చికిత్స కోసం ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపాల్‌నాయక్, హనుమాన్‌రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఘటం ఊరేగింపు



ఊరేగింపులో భక్తులు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ 40వ వార్షిక, కల్యాణోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. మొదటిరోజు అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఘటాన్ని రావిర్యాల గ్రామంలోని భక్తుడు నాగేశ్వర్‌గౌడ్ ఇంటి నుంచి ఎల్లమ్మ ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకుపోయారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రత్నం, పాలకమండలి సభ్యులు, దేవాదాయధర్మదాయ శాఖ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు ఇంటింటికీ బీజేపీ

తలకొండపల్లి: మహాజన్ అభియాన్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించేందుకు ఇంటింటికీ బీజేపీ అనే కార్యక్రమానికి ఆ పార్టీ నేతలు మంగళవారం శ్రీకారం చుట్టనున్నారు. ఈ కార్యక్రమానికి సీనియర్ నాయకుడు తల్లోజు ఆచారి హాజరవుతున్నారని ఆ పార్టీ మండలాధ్యక్షుడు రవిగౌడ్ సోమవారం తెలిపారు. మండలంలోని సంఘాయిపల్లి, చౌదర్‌పల్లి, మాదాయిపల్లి, ఇస్రాయిపల్లి, చెన్నంపల్లి, వెంకటాపూర్, అంతారం గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శక్తి కేంద్రాల ఇన్‌చార్జిలు, బూత్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్ని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

64వ రోజుకు చేరిన దీక్షలు

తలకొండపల్లి: గట్టుఇప్పలిపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని జేఏసీ నాయకులు చేపట్టిన రిలే నిరాహారదీక్షలు సోమవారానికి 64వ రోజుకు చేరుకున్నాయి. 63 రోజులుగా దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం కనికరం చూపడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు సమస్యను పరిష్కరించడానికి ఎలాంటి చర్య తీసుకోలేదని వాపోయారు. తలకొండపల్లి మండల కేంద్రానికి వెళ్లాలంటే ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో దామోదర్, రేణురెడ్డి, మచ్చేందర్, రాజు పురుషోత్తం, రాంరెడ్డి, చెన్నయ్య, శేషనాయక్, మోహన్, ఆంజనేయులు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

టీఎస్‌ఎస్‌ఓ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మినివాస్

తలకొండపల్లి: ప్రాథమిక విద్యకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని టీఎస్‌ఎస్‌ఓ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మినివాస్ అన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారిని సోమవారం ఆయన హైదరాబాద్‌లో కలిశారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, వనరులు కల్పించి విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం లక్ష్మినివాస్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యాభివృద్ధికి అధిక నిధులను కేటాయించాలన్నారు. ప్రతి విద్యార్థిని శాస్త్ర, సాంకేతిక రంగాల్లో రాణించే విధంగా తీర్చిదిద్దాలన్నారు.

ఇంటి నిర్మాణానికి చేయూత

తలకొండపల్లి: పేదల ఇండ్ల నిర్మాణాలకు ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ చేయూత నందిస్తున్నారు. మండలంలోని లింగరావుపల్లికి చెందిన అంజయ్య నూతన ఇంటి నిర్మాణాన్ని చేపట్టాడు. డబ్బులు లేక నిర్మాణాన్ని నిలిపివేశాడు. స్థానిక నాయకుడు ఇమ్రాన్ సహకారంతో జెడ్పీటీసీకి కలుసుకొని ఆర్థిక సహాయం చేయాలని అంజయ్య కోరాడు. స్పందించిన వెంకటేశ్ ఇంటి నిర్మాణానికి సోమవారం సిమెంట్, స్టీల్ తదితర సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ కేశవరెడ్డి, రెడ్ క్రాస్‌సొసైటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీనివాసురెడ్డి, సర్పంచ్ ఎల్లమ్మ, తిరుపతయ్య, ఉప సర్పంచ్ మణికంఠ, బ్లడ్ బ్యాంక్ చైర్మన్ అంజిరెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులున్నారు.

ఘనంగా ఓరియంటేషన్ డే



అధ్యాపకులను సత్కరిస్తున్న కళాశాల అవంతి శ్రీనివాసరావు తదితరులు

అబ్దుల్లాపూర్‌మెట్: గుంతపల్లి గ్రామంలోని అవంతి విద్యాసంస్థల ఆవరణలో సోమవారం ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం విద్యార్థుల ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అవంతి విద్యాసంస్థల చైర్మన్, భీమిలి ఎమ్మెల్యే ముత్తెంశెట్టి శ్రీనివాసరావు, అవంతి విద్యాసంస్థల కార్యదర్శి డాక్టర్ ప్రియాంకతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ జయప్రద, ప్రిన్సిపల్స్ రామచంద్రారెడ్డి, శివకుమార్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ స్వామిరావ్, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గురునానక్ కళాశాలలో..

ఇబ్రహీంపట్నం: అంకితభావం, క్రమశిక్షణతోనే అత్యుత్తమ విద్యను పొందగలమని హైదరాబాద్ న్యూ క్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ చైతన్యమోయ్ గంగూలీ అన్నారు. గురునానక్ కళాశాలలో ఓరియంటేషన్ డేను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని ముందుకుసాగాలని సూచించారు. కమ్యూనికేషన్ స్కిల్స్‌ను మెరుగుపరుచుకుంటేనే భవిష్యత్తులో రాణిస్తారన్నారు.

రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం: రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. సోమవారం వనస్థలిపురంలో ఎల్‌బీనగర్ నియోజకవర్గం పరిధిలోని రేషన్ డీలర్లతో నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ డీలర్ల కమిషన్‌ను ఇటీవలే ప్రభుత్వం రూ. 70 నుంచి రూ.140కు పెంచిందని అన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తే రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న అన్ని సమస్యల పరిష్కారానికి, కమిషన్ రూ. 200 పెంపుకు కృషి చేస్తానని అన్నారు. సమయ పాలనతో అన్ని రకాల నిత్యావసర సరుకులు పేదలకు అందేలా రేషన్ డీలర్లు బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు డీలర్లు మాట్లాడుతూ రేషన్ డీలర్స్ వెల్ఫేర్ సొసైటీ కార్యాలయంకు 300 గజాల స్థలం ఇప్పించాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షులు చింతల రవికుమార్, రేషన్ డీలర్స్ వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు మల్లేష్‌గౌడ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు వైకుంఠం, సూర్యప్రకాష్, యాదగిరి, మహేష్‌రెడ్డి, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

స్థానికులకే ‘డబుల్’ ఇళ్లు కేటాయించాలి

బీజేపీ నాయకుడు లక్ష్మణ్



దరఖాస్తుదారులతో బీజేపీ నాయకులు

తుక్కుగూడ: మంఖాల్, సర్దార్‌నగర్ గ్రామాల్లో ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని నిరుపేదలకు కేటాయించాలని మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు లక్ష్మణ్, మున్సిపల్ చైర్మన్ కాంటేకర్ మధుమోహన్ డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని మంఖాల్ గ్రామంలో డబుల్‌బెడ్‌రూం దరఖాస్తుదారులతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు... స్థానికంగా నిర్మించిన డబుల్ ఇళ్లను ఇక్కడి నిరుపేదలకు ఇవ్వకుండా నగరానికి చెందిన ముస్లిం మైనార్టీలకు ఇవ్వడం ఎంతవరకు సమజంసం అని ప్రశ్నించారు. మంత్రి సబితారెడ్డి తన ఏకపక్ష నిర్ణయాలతో ఇతర ప్రాంతానికి చెందినవారికి ఇక్కడ ఇళ్లను కేటాయించారని ఆరోపించారు. తుక్కుగూడ మున్సిపాలిటీతో పాటు మహేశ్వరం నియోజకవర్గంలో వందాలాదిమంది నిరుపేదలు సొంత ఇళ్లు లేక కిరాయి ఇంట్లో ఉండి ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. స్థానికులకు డబుల్ ఇళ్లు కేటాయించకపోతే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు యాదగిరిరెడ్డి, వై.శివకుమార్, బి.విలాస్, ఆర్.రాజు, నాయకులు బి.రాజుగౌడ్, సుధాకర్, మదన్‌మోహన్, శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్‌నాయక్, దరఖాస్తుదారులు తదితరులు పాల్గొన్నారు.